## క్లుప్తంగా

### దంత, నేత్రవైద్య శిబిరం


శిబిరంలో సేవలందిస్తున్న డెంటిస్ట్ సుధారాణి

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామంలో గజపతినగరం పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర, వైద్య శిబిరాలు నిర్వహించారు. విజయనగరానికి చెందిన వెంకటరామ కంటి ఆస్పత్రికి చెందిన ఆప్తాలమిక్ విష్ణువర్ధన్, వెంకటసుధ డెంటల్ హాస్పిటల్ డెంటిస్ట్ లెంక సుధారాణి సుమారు 200 మందికి నేత్ర, దంత పరీక్షలు చేశారని పీఎంపీ అసోసియేషన్ ఇన్‌చార్జ్ ఎల్.స్వామినాయుడు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పీఎంపీలు రెడ్డి అప్పలనాయుడు,పాట్నూరు పైడిరాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

### పందెం రాయుళ్ల అరెస్టు

వేపాడ: మండలంలోని కొత్త శింగరాయి గ్రామ సమీపంలో ఆదివారం కోడి పందేలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని వల్లంపూడి ఎస్‌ఐ దేవి తెలిపారు. కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బంది కలిసి దాడి చేశామని చెప్పారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక సెల్‌ఫోన్ కోడి పుంజు, కత్తులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది సూరిబాబు, సింహాచలంనాయుడు, సత్యం, కనకరాజు, రాజు పాల్గొన్నారు.

### ప్రారంభించేదెప్పుడో..?


ప్రారంభానికి నోచుకోని కొండపాలెం ఆర్బీకే భవనం

చీపురుపల్లిరూరల్(గరివిడి): రైతులకు గ్రామాల్లోనే వ్యవసాయ సాగు సంబంధిత సేవలన్నీ అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామసచివాలయాలకు అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే)ను ఏర్పాటు చేసింది. సొంత భవనాల నిర్మాణాల కోసం లక్షల రూపాయలు మంజూరు చేశారు. గరివిడి మండలానికి 21 ఆర్బీకేలు మంజూరు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆర్బీకేల నూతన భవనాల నిర్మాణాలు ఎన్నికలకు ముందే పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. కొండపాలెం మేజర్ పంచాయతీలో ఆర్బీకే భవన నిర్మాణం గత ఏడాదే పూర్తయినప్పటికీ నేటికీ ప్రారంభం కాలేదు. గరివిడి టీచర్స్ కాలనీకి సమీపంలో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే భవనాలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వాటిని వినియోగించడం లేదు. ప్రస్తుతం టీచర్స్ కాలనీశివారులో ఉన్న పూర్వ ప్రాథమిక పాఠశాల భవనంలో ఆర్బీకేను నిర్వహిస్తున్నారు. ఏనుగువలస,దువ్వాం, మందిరవలస, చుక్కవలస పంచాయతీల్లో ఆర్బీకే భవనాల నిర్మాణాలకు సంబంధించి చిన్నచిన్న పనులు మిగిలిపోయాయని, వాటిని పూర్తి చేయించి ప్రారంభించాలనే ఆలోచన అధికారులు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక


కొత్త కార్యవర్గ సభ్యులు వీరే..

విజయనగరం ఫోర్ట్: ఏపీ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన ఈ ఎన్నికలో ప్రెసిడెంట్‌గా కె.సత్యప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.శ్రీనివాసరావు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా జి.ఎన్.ఎస్.పట్నాయక్, జాయింట్ సెక్రటరీగా జి.ఎన్.ఎస్.ప్రసాద్, జాయింట్ సెక్రటరీ–2గా జి.వీర్రాజు, జాయింట్ సెక్రటరీ–3గా టి.రాజ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.శ్రీను, ఆర్గనైజింగ్ సెక్ర టరీ–2గా బి.రఘు, ఆఫీస్ సెక్రటరీగా బి.శాస్త్రి, ఫైనాన్స్ సెక్రటరీగా పి.త్రినాథ్, బిల్డింగ్ సెక్రటరీగా గురుప్రసాద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### దోమల నివారణకు 'ఫాగింగ్'


నగరంలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

విజయనగరం: నగరంలో ఆదివారం ఫాగింగ్ చర్యలు చేపట్టారు. నగర కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ నగరంలో దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు తీసుకోవడం జరుగుతోందని, మరోవైపు యాంటీ లార్వా ఆపరేషన్ కూడా చర్యలు చేపడుతున్నామన్నారు. నగరవాసులు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించి దోమలు వృద్ధి చెందకుండా చూడాలని కోరారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని, మురుగునీరు, అనవసర నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. నీరు ఎక్కువ కాలం నిల్వ ఉన్న ప్రదేశాల్లోనే దోమలు ఎక్కువగా పెరుగుతాయని, వాటి ద్వారా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి జ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ దోమల నివారణకు కృషి చేయాలని కోరారు.

| గజపతినగరం సబ్‌డివిజన్ పరిధిలో 2023, 2024 ఖరీఫ్ సీజన్‌లలో పత్తి సాగు వివరాలు(ఎకరాల్లో) | | |
|---|---|---|
| మండలం | 2023లో సాగు విస్తీర్ణం | 2024లో సాగు విస్తీర్ణం |
| గజపతినగరం | 261 | 412 |
| దత్తిరాజేరు | 280 | 265 |
| మెంటాడ | 91 | 121 |


కొత్తశ్రీరంగరాజపురంలో పత్తి పంటను ఆశించిన తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు(ఫైల్)

# పత్తి రైతుకు దక్కని మద్దతు

- పెరిగిన పెట్టుబడి, తగ్గిన మద్దతు ధర
- తెగుళ్లు, వాతావరణ పరిస్థితుల ప్రభావంతో తగ్గిన దిగుబడి
- గిట్టుబాటు ధర లభించక పత్తి రైతు చిత్తు
- ఎకరానికి 5 క్వింటాళ్లకు మించని దిగుబడి
- ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521
- కొనుగోలు కేంద్రాలు లేక దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- దళారులు చెల్లిస్తున్న ధర క్వింటాల్‌కు రూ. 6,200


పాత శ్రీరంగరాజపురంలో ఓ రైతు తన ఇంటిలో నిల్వచేసిన పత్తి

గజపతినగరం: ఈ ఏడాది పత్తి రైతుకు కష్టాలు తప్పడం లేదు. పెట్టుబడి, శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, తెగుళ్ల విజృంభించడంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పత్తి పంట సరైన దిగుబడి లేదు. దిగుబడి రాక, ధరలేక రైతులు నష్టాలను మూటగట్టుకోక తప్పడం లేదు. మూడేళ్ల క్రితం క్వింటాల్ పత్తి మద్దతు రూ.8 వేలకు పైనే ఉండేది, ప్రస్తుతం ఆ ధర కూడా లేక పోవడంతో గజపతినగరం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్‌లో పత్తి సాగు చేసిన రైతులు తెల్లబోతున్నారు. గజపతినగరం సబ్‌డివిజన్ పరిధిలోని గజపతినగరం,దత్తిరాజేరు, మెంటాడ మండలాల్లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సుమారు 800 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. గజపతినగరంలోని శ్రీరంగరాజపురం,ఎం.గుమడాం, పట్రువాడ, గంగచోళ్లపెంట,దత్తిరాజేరు మండలంలోని చౌదంతివలస, మరడాం, కొత్త వలస, చినకాద,కన్నాం,మెంటాడ మండలంలో జక్కువ,గుర్రంవలస,ఉద్దంగి,కూనేరు,చల్లపేట తదితర గ్రామాల్లో ఈ పంట వేశారు. ఎకరానికి దుక్కులు, విత్తనాలు ఎరువులు, పురుగు మందులు, గొప్పులు, కలుపు తీత, కాలిబాటలు వేసేందుకు, పత్తి ఏరెందుకు కూలీలకు కలిపి రూ.25 వేల నుంచి రూ.30వేలకు పైగానే ఖర్చవు తోందని రైతులు చెబుతున్నారు.పంటను గులాబీ రంగుపురుగు, బాల్ వీవిల్, సిల్వర్ ఫిష్ ఇతర తెగుళ్ల ఆశించడంతో ఆ ప్రభావం దిగుబడిపై పడింది. ఎకరాని కి 5 క్వింటాళ్లకు మించని పరిస్థితి నెలకొంది. ఎకరానికి 10 క్వింటాళ్లకు పైగానే దిగుబడులు రావాల్సి ఉన్నప్పటికీ వాతావరణం అందుకు అనుకూలించలేదు. ఏదోలా నానా కష్టాలు పడి సాగు చేయగా వచ్చిన పత్తిని ఇంటికి తెచ్చి అమ్ముకుందా మను కుంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521 ఉన్నప్పటికీ దళారులు రూ.6,200కు మించి కొనుగోలు చేయడం లేదు. గజపతినగరం నియోజకవర్గంలో పత్తికొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. బొబ్బిలి నియోజక వర్గంలోని రామభద్రపురం మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రం ఉంది. అంతదూరంలో ఉన్న కొనుగోలు కేంద్రాలకు వాహ నాల ద్వారా రవాణా చేయడం ఖర్చుతో కూడుకున్న పని కావడంతో గత్యంతరం లేక దళారులకు పంటను విక్రయించుకుంటున్నారు.పెరిగిన ఖర్చులు, తగ్గిన దిగుబడులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మద్దతు ధరను రూ.10వేలకు పెంచాలని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

### ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం



పత్తి సాగు చేసే రైతులకు అన్ని రకాలగా వ్యవసాయ శాఖ నుంచి సహాయ, సహకారాలు అందిస్తున్నాం.సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్నాం.గతేడాది కంటే ఈఏడాది ఎక్కువ విస్తీర్ణంలో రైతులు పత్తిపంట సాగు చేశారు. మద్దతు ధర పెంచాలని రైతులు కోరుతున్నారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం.
– సీహెచ్. ధనలక్ష్మి, ఏఓ, గజపతినగరం మండలం

### కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



ఈఏడాది 8 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. మద్దతు ధర లేకపోగా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రం కూడా అందుబాటులో లేక పోవడంతో దళారుల కు పంట విక్రయించుకోవాల్సి వచ్చింది. క్వింటాల్ రూ.6,200కే విక్రయించడంతో శ్రమకు తగ్గ ప్రతిఫలం రాలేదు. ప్రభుత్వం వచ్చే ఏడాదైనా మద్దతు ధరను రూ.10వేలు చేస్తేనే గిట్టుబాటు అవుతుంది. అలాగే గజపతినగరంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.
– తాడ్డి జోగినాయుడు, రైతు, కొత్తశ్రీరంగరాజపురం, గజపతినగరం మండలం

## జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో స్వర్ణపతకం


స్వర్ణ పతకం సాధించిన డీఎం రమేష్


శృంగవరపుకోట: జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్(డీఎం) కె.రమేష్ స్వర్ణ పతకం సాధించారు. ఏఎస్ఆర్‌టీయూ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని కైలాసగిరి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్ నిర్వ హించారు. ఈస్పోర్ట్స్ మీట్‌లో దేశంలో ఉన్న అన్ని ఆర్టీసీల ఉద్యోగులు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో 50 ఏళ్ల లోపు ఆఫీసర్లకు 7వ తేదీన 1,000 మీటర్ల ఫాస్ట్ వాకింగ్ పోటీలు నిర్వహించగా స్థానిక ఆర్టీసీ డీఎం రమేష్ ప్రథమ స్థానంలో నిలిచారు. స్వర్ణ పతకం సాధించిన డీఎంను ఆర్టీసీ సిబ్బంది, ఉద్యోగులు ఆదివారం అభినందించారు.

## సత్కారం


అర్జున్‌మహేశ్వరరావును సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

గంట్యాడ మండలంలోని బుడతనాపల్లి గ్రామానికి చెందిన రంధి అర్జున్‌మహేశ్వరరావు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయన్ని విజయనగరానికి చెందినఎంఆర్ యునై టెడ్ వాకర్స్ క్లబ్ వారు బుడతనాపల్లిలో ఆదివారం సత్కరించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలీ, ప్రతినిధులు సుధాకర్, ప్రసాద్, జాడే భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.
– గంట్యాడ

## వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం


సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

లక్కవరపుకోట: సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో వేదపండితులు ఏ.శ్రీహరి శర్మ ఆధ్వర్యంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మహోత్సవంలో అధిక సంఖ్యలోభక్తులు పాల్గొన్నారు.

# ప్రహరీ నిర్మించరూ..


చెరువును ఆనుకుని ఉన్న సిరియాలపేట ప్రాథమిక పాఠశాల

మెరకముడిదాం: మండలంలోని సిరియాలపేట ప్రాథమిక పాఠశాల చెరువును ఆనుకుని ఉంది. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పిల్లలు ఆటలాడుకునే సమయంలో కాలుజారి చెరువులోకి పడిపోయే అవకాశం, సరదా కోసం ఎవరైనా పిల్లలు చెరువులోకి దిగితే మునిగిపోయే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు వైపు విద్యార్థులు వెళ్లకుండా ఉపాధ్యాయులు రెడ్ రిబ్బన్‌ను ఏర్పాటు చేశారు. చెరువులో నుంచి అప్పుడప్పుడు విషసర్పాలు కూడా పాఠశాల లోకి వస్తున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇటీవల వర్షం కురుస్తున్న సమయంలో చెరువులో నుంచి విషసర్పం రావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు బయటకు పరుగులు తీశారు. ఈ సమస్యలన్నీ ప్రహరీ లేకపోవడం వల్లేనని, అధికారులు స్పందించి పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# సమయం.. పెట్టుబడి ఆదా


గంట్యాడ మండలం సిరిపురంలో యంత్రం ద్వారా వరి కోతలు చేయిస్తున్న రైతులు

- యంత్రాలతో వరి కోతలు, నూర్పులు

గంట్యాడ: వ్యవసాయం రంగంలో వస్తున్న నూతన మార్పులు, యాంత్రీకరణ వల్ల అన్నదాతలకు అన్నివిధాలా మేలు జరుగుతోంది. కూలీల కొరత కారణంగా రైతులు యంత్రాలపై ఎక్కువగా ఆధారపడు తున్నారు. ముఖ్యంగా వరి కోతలు, మోత, నూర్పులు చేయడానికి రైతులు కూలీల కోసం అధిక మొత్తంలో వెచ్చించాల్సి వస్తోంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి కోతలు ముమ్మరంగా సాగు తున్నాయి. కూలీల కొరతతో రైతులు వరికోత, నూర్పులకు యంత్రాలను వినియోగిస్తున్నారు. సాధారణంగా తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఎక్కువగా యంత్రాల ద్వారానే వరి కోతలు, నూర్పులు చేస్తుంటారు. అయితే ఈఏడాది జిల్లాలో కూడా పలువురు రైతులు యంత్రాల ద్వారా కోతలు, నూర్పులు చేయిస్తున్నారు.

**కూలీల ఖర్చు రూ.18 వేలు**

ఎకరా పొలంలో వరి కోతలు చేయడానికి మహిళా కూలీలు రూ.6 వేలు అడుగుతున్నారు. కొంతమంది అయితే రూ.7వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. కూలితో పాటు వారి భోజనాలకు కలిపి రూ.8 వేల వరకు ఖర్చవుతోంది. ఇంకా చేను మోతలు, కుప్పలు పెట్టడం, నూర్పులు, ధాన్యం గాలిపోత, ఇతర పనులకు మరో రూ.10వేల వరకు ఖర్చవుతోంది. ఏకంగా ఎకరానికి రూ.18 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. యంత్రం ద్వారా రూ.3,500 ఖర్చుతో ధాన్యం ఇంటికి యంత్రాలతో వరి కోతలు, నూర్పులు చేయడం వల్ల రైతులకు ఖర్చులు గణనీయంగా తగ్గుతున్నాయి. యంత్రం ద్వారా కోతలు, నూర్పులు చేసేం దుకు ఎకరానికి రూ.3,500 అయితే సరిపోతున్నాయి. కూలీలతో కోతలు, నూర్పులు చేయించడం కంటే అవే పనులు యంత్రాలతో చేయించడం వల్ల రైతులకు రూ.14,500 వరకు మిగులుతోంది. నాలుగు ఎకరాలున్న రైతులకు అయితే రూ.58 వేల వరకు ఆదా అవుతుంది. దీంతో రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు.


నూర్పు చేసి నేరుగా ట్రాక్టర్‌లోకి ధాన్యం వేస్తున్న యంత్రం

### రూ.45 వేలు ఆదా



నాకు సొంత పొలం రెండు ఎకరాలు ఉంది. మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాను. ఎకరానికి వరికోత కోయడానికి మహిళా కూలీలు రూ.6 వేలు అడిగారు. దీంతో యంత్రం సహాయంతో మూడు ఎకరాల్లో కోత కోయించాను. వెంటనే అదే యంత్రంతో నూర్పిడి కూడా అయిపోయింది. మూడు ఎకరాలకు రూ.10,500 ఖర్చు అయింది. ఇదే పనులను కూలీలతో చేయిస్తే రూ.54 వేల వరకు ఖర్చు అయ్యి ఉండేది. యంత్రం ద్వారా కోతలు, నూర్పు చేయడం ద్వారా రూ.45 వేలు ఆదా అయ్యింది.
– కరక నాయుడు ,రైతు , పెదవేమలి

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


వేపాడ: కొండగుళ్లలో సమావేశమైన వేపాడ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు


చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌కు రూ.లక్ష నగదు అందజేస్తున్న శ్రీరామ్ హైస్కూల్ పూర్వ విద్యార్థి, వేదపండితుడు రామానుజాచార్యులు, తదితరులు


బొండపల్లి: సమావేశమైన గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు

వేపాడ: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో1980– 84 మధ్య చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కొండగుళ్లలో ఆదివారం సందడిగా సాగింది. పాఠశాల విద్యాభ్యాసం అనంతరం వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నత చదువులు చదువుకుని వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా నాలుగు దశాబ్దాల తర్వాత ఒకే చోట కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, కుటుంబ జీవితం, కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో సందడిగా గడిపారు.

**శ్రీరామ్ హైస్కూల్ విద్యార్థుల అపూర్వ కలయిక**

చీపురుపల్లి రూరల్(గరివిడి): పూర్వ విద్యార్థులతో గరివిడిలోని శ్రీరామ్ హైస్కూల్ ఆదివారం సందడిగా మారింది. 1962 నుంచి 2024 మధ్య కాలంలో శ్రీరామ్ విద్యాసంస్థల్లో విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. స్థానికంగా స్థిరపడిన వారితో పాటు వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు హాజరయ్యారు. పర స్పరం యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, చిన్ననాటిజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థి, వేదపండితులు కశింకోటకు చెందిన రాజేటి రామానుజాచార్యులు మాట్లాడుతూ పేద,ధనిక తారతమ్యాలకు తావులేనిది స్నేహమని అన్నారు. శ్రీరామ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమెన్, చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల కోసం పూర్వ విద్యార్థులు అంతా కలిసి రూ. లక్ష ఆర్థిక సహాయం చేశారు. నగదును ఉమెన్, చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ నిర్వాహకులు, ఫేకర్ సీఈఓ ఎం.ఎస్.ఎస్.శర్మ, ఫేకర్ యాజమాన్య ప్రతినిధి రామకృష్ణ కు అందజేశారు. అనంతరం సహఫంక్తి భోజనాలు చేశారు. జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు,హైకోర్టు న్యాయవాది మజ్జి సూరిబాబు, పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కమిటీ చైర్మన్ అప్పారావు, పూర్వ విద్యార్థులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు,చక్రధరరావు, నరసింహమూర్తి, గుప్త, రామకృష్ణ, ఉప్పు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**గజపతినగరం కళాశాల విద్యార్థుల సమావేశం**

బొండపల్లి: స్థానిక వనమిత్ర కేంద్రంలో గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం నిర్వహించారు. 1972 విద్యాసంవత్సరం నుంచి 2022వ సంవత్సరం వరకు ఆ కళాశాలలో చదువుకున్న విద్యార్థుల్లో కొంతమంది సమావేశమయ్యారు. వచ్చే ఏడాది ఇదే నెలలో పూర్వ విద్యార్థుల అందరినీ సమీకరించి పెద్ద ఎత్తున పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంతో పాటు,సేవా కార్య క్రమాలు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం సభ్యుడు జోగారావు తెలిపారు.

## మండల పరిషత్ తీర్మానించిన పనులే చేపట్టాలి

విజయనగరం రూరల్: గ్రామసభల్లో ఆమోదం పొంది, మండల పరిషత్ తీర్మానం చేసిన పనులనే చేపట్టాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్, ఎన్ఆర్ఈజీఎస్ అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులు, సచివాలయ కార్యదర్శులతో అత్యవసర సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ చట్టం–2005 పక్కాగా అమలు చేయాలన్నారు. చట్టం అమలులో చిత్తశుద్ధి లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. గతంలో గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను తీర్మానం చేయకుండానే కొంతమంది అధికారులు ఆమోదముద్ర వేశారన్నారు. ఇకపై అలా జరిగితే సంబంధిత అధికారులే బాధ్యులవుతారన్నారు. దీనికి ప్రజాప్రతినిధులంతా ఆమోదం తెలపాలన్నారు. ఇప్పుడు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపిస్తోందని, దీనిపై పంచాయతీరాజ్ ఏఈతో పాటు విజిలెన్స్ అధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులు, యువతకు అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్

విజయనగరం క్రైమ్: మత్తు పదార్థాలతో జీవితం నాశనం అవుతుందని, ప్రతిఒక్కరూ గంజాయి, మద్యం, ఖైనీ, గుట్కా, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్‌ఐలు ప్రసన్నకుమార్, రామగణేష్‌లు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా బాలాజీనగర్ వద్ద విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఫ్యాషన్ మాయలో పడి యువత, విద్యార్థులు ఎక్కువగా చెడు అలవాట్లకు బానిసలై, తమ భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మంచి అలవాట్లు అలవర్చుకుని, ఆదర్శవంతమైన జీవనం సాగించాలన్నారు. బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, ఎం.ఆర్.హాస్పిటల్, కళాశాలలు, ప్రధాన కూడళ్లలో డ్రాప్‌బాక్సులు ఏర్పాటు చేశామని, వారానికోసారి వాటిని తనిఖీ చేస్తామన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసలైతే ఆ డ్రాప్‌బాక్సుల్లో ఉత్తరం రాసి వేసి సమాచారం ఇవ్వాలన్నారు.